# తరం - అంతరం

- పూజిత

రాజాలక్ష్మి - న్యూజెర్సీ
కథల పోటీలో
రు.1000/- బహుమతి
పొందిన కథ



ఆకాశంలో పొర్లు తున్న మేఘాలు -

అతడి చేతిలోని ఫోను రిసీవర్ బిగుసుకుంది; ఆ వార్త అతడిలో మహేంద్రజాలాన్ని సృష్టిస్తోంది; రక్తం ఎక్కడెక్కడికో మహోధృతంగా ప్రవహిస్తోంది!

పెళ్ళయిన పన్నెండేళ్ళకి బిడ్డ -

"ఆడపిల్ల, అయితేనేం, మగవాడయితేనేం - తనకూ ఓ బిడ్డ!"

ఏదో తెలియని ఉద్వేగానికి గురయ్యాడు; కొత్త అలజడికి లోనయ్యాడు.

అతడు - 'చందూ' అని పిలవబడే చంద్రం.

మరి రెండు నిమిషాలలో మారుతీ 'జిప్' రోడ్డెక్కింది...

లోకమంతా నందనవనంలా; జనమంతా ఆనందాతిశయంతో పరుగెత్తుతున్నట్లు కనిపించారు.

అతనికి భార్య గుర్తొచ్చింది. మన్మథుని విల్లులా భాసించే ముక్కు గుర్తొచ్చిందతనికి...

ఆ ముక్కు తన బిడ్డకి కూడా వస్తే...

ఆ ముక్కు చూసే కదా పింగ్‌పాంగ్ ఆమె రేఖాచిత్రం గీయాలని ముచ్చటపడింది!

ఆడపిల్ల...

ఎలా వుందో... అచ్చం అమ్మను పోలి వుంటుంది. కూతురికి తల్లి పోలికలు వస్తే అదృష్టవంతురాలంటారు...

ఆ పాప తాలూకు ఆలోచనలతోనే నర్సింగ్ హోమ్ కాంపౌండులోకి అడుగుపెట్టాడు.

ఎక్కడో గుండెల్లో ప్రారంభమైన చిన్న కదలిక ప్రతి అవయవానికి పాకి ఉత్తుంగ తరంగమై ఊపేస్తోంది.

అంజలి... తన భార్య వున్న గదిలోకి అడుగుపెట్టాడు.

అటెండెంట్ తనని చూస్తూనే గౌరవంగా లేచి నిలబడింది.

అటువైపు తిరిగి పడుకున్న అంజలి పట్ల తనకున్న ప్రేమని - తనకు ఓ బిడ్డను అందించిన ఆ మాతృమూర్తికి తన కృతజ్ఞతని తెలియజేయడానికి ఆమె భుజం మీద చేయి వేసి నొక్కాడు.

"సార్... అమ్మగారికి మత్తు ఇచ్చారు-" అటెండెంట్ చెప్పింది.

ఆమె మీదకు వంగి బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు. "థాంక్యూ డార్లింగ్, థాంక్యూ వెరీమచ్..." అంటూ అక్కణ్నుంచి కదిలాడు. "బేబీ ఎక్కడ..." అనడుగుతూ పర్సు తెరిచి చేతికి వచ్చిన నోట్లను తీసి అటెండెంట్ చేతికి ఇచ్చాడు.

"థాంక్యూ సర్... సిస్టర్‌కి చెబుతాను, ఇప్పుడే తీసికెళ్ళింది" అంటూ సుడిగాలిలా కదిలింది.

తన బిడ్డను చూసుకోబోతున్నాడు... గత పన్నెండేళ్ళ తన మధుర స్వప్నాన్ని వీక్షించబోతున్నాడు...

నరాలను నలిపేస్తున్న ఉత్కంఠ, ఉద్వేగం, గుండె గొంతులో కొట్టాడుతున్న భావన!

సిస్టర్ వస్తోంది... తెల్లని యూనిఫారంలో వుంది సిస్టర్; మంచులో స్నానించిన మల్లెపూవులా వుంది సిస్టర్!

అడుగులు పడుతున్నకొద్దీ తనకూ, తన స్వప్న సామ్రాజ్యానికీ దూరం తరిగిపోతోంది. బిడ్డను ఒక చేత్తో అందుకుని మరో చేత్తో ఒక బంగారు ఉంగరాన్ని బహూకరించాలని సిద్ధపడ్డాడు. ఆ ఆనందం అతిశయించి

21-7-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

గుండెను గుప్పెట బిగిస్తోంది. ఊపిరి పీల్చడం కష్టంగా వుంది. 'తన బిడ్డను తాను చూస్తాడా... తన బిడ్డను రెండు చేతుల్లోకి తీసుకొని ముద్దాడే యోగం 'నకి వుందా? భగవాన్... ఏమిటీ గుండెనొప్పి క్షణక్షణానికి ఉధృతమవుతోంది... పన్నెండేళ్ళుగా ఎదురుచూస్తున్న మహత్తర క్షణాలను ఇలా మార్చేస్తున్నావా?' – మనసు మూగగా రోదిస్తోంది. కానీ కళ్ళు, చేతులు బిడ్డ కోసం ఆత్రంగా చూస్తున్నాయి.

తల్లి అపస్మారక స్థితిలో వుంది... బొడ్డు కోసిన బిడ్డ సిస్టర్ చేతుల్లో వుంది. అటెండెంట్ – పెయిడ్ సర్వెంట్!

"ఇదిగోండి మీ పాప..." అంటూ ఆ పసికందుని అందించడానికి చేతులు ముందుకు చాచిందామె!

ఆ పాపని అందుకోవడానికి చేతులు చాచిన అతడు అప్రయత్నంగా పాప ముఖంలోకి చూశాడు. అంతే!!

అది నప్పటి జలదరింపు కాదు, లక్ష ఓల్టుల షాక్...

రెప్పపాటు కాలంలో ఘోర ప్రమాదం తప్పింది. సిస్టర్ అతడి చేతుల్లోకి బిడ్డని విడవబోయే సమయంలో జరిగిందది...

ఆ పాప ఇండియన్ కాదు... నేపాలీ! ఆ ముఖం చూస్తే చాలు ఆ బిడ్డ ఎవరో చెప్పొచ్చు.

తన బిడ్డను – తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డను అందుకోవడానికి చాచిన చేతులు ఆ నేపాలీ పాపను చూడగానే అప్రయత్నంగా వెనుకకు వచ్చాయి.

"సిస్టర్ ఈ బిడ్డ నా బిడ్డ కాదు... నా బిడ్డ మారిపోయింది. ఈ బిడ్డ నేపాలీ బిడ్డ" అని అతడు గొడవ చేయలేదు. అతడే కాదు, అతడి భార్య కూడా ఆ మాట అనలేదు. బిడ్డను చూస్తూనే ఆమె ఫెయింట్ అయింది.

తల్లీ, తండ్రీ – ఇద్దరూ ఆ బిడ్డను డిజ్‌వోన్ చేసుకుంటున్నారా?

ఇప్పుడు తెల్లబోవడం తెల్లని యూనిఫారంలోనున్న సిస్టర్ వంతయింది. అతడు ఆ గదికి వున్న సిటౌట్ వైపు నడిచాడు. అప్రయత్నంగా జేబులోని సిగరెట్ ప్యాకెట్ తీశాడు చందూ.

తెల్లని ఆ మొహం రక్తం నింపుకోవడానికి అయిదు నిమిషాలు పట్టింది. వెంటనే వెనుదిరిగింది.

చందూ ఆలోచనలు ఒకే ఒక పాయింట్ దగ్గర ఆగిపోయాయి.

– అంజలి తన ప్రాణం!

ఆమె ఊపిరికి భాషను పొదిగితే అది స్మరించే ఏకైక పదం 'చందూ'!

ఆమె పట్ల తనకు అపారమైన విశ్వాసం వుంది. ఎంతగా అంటే – తనని తాను విశ్వసించనంతగా!

అంజలికి చాలా సరదాలున్నాయి. మొక్కల్ని, కుక్కల్ని పెంచడమే కాదు, పురాతన వస్తువుల్ని సేకరించడం – అపురూపమైన పెయింటింగ్స్ తన ఇంట్లో అలంకరించడం!

ఈ క్రమంలో పరిచయమయ్యాడు పింగ్‌పాంగ్. బుద్ధిజాన్ని అధ్యయనం చేయడానికి గుంటూరు జిల్లాలో పర్యటించిన అతడ్ని ప్రభావితం చేసిన తెలుగువాడు సంజీవదేవ్‌గారు. తుమ్మపూడిలోనే అంజలికి పరిచయమయ్యాడతడు. ఆ పరిచయంతోనే హోస్ట్ చేసింది. పింగ్‌పాంగ్‌లోని గొప్పతనం – కలరింగ్! అతడి కలరు స్కీమ్ వడ్డాది పాపయ్యగారిని గుర్తుచేస్తుంది.

ఓ రోజున తాను ఇంటికి వచ్చేసరికి హాలులో ఈజిల్ మీద కాన్వాసు రంగులు పులుముకుని వుంది. ఆ వర్ణచిత్రం – అంజలి!

ఆ చిత్రం చూస్తేగాని అంజలిలోని బ్యూటీ స్పాట్స్ గుర్తించలేకపోయాడు!

తన భార్య ఎత్తుపల్లాలను, బ్యూటీ స్పాట్స్‌ని ఆమెతో కాపురం చేసిన తనకన్నా అతడే మున్నగా గుర్తించినందుకు మానవ సహజమైన ఈర్ష్య–ద్వేషం–కోపం అతడిలో చోటు చేసుకోలేదు; అతడిలోని కళాకారుడ్ని మెచ్చుకున్నాడు. పింగ్‌పాంగ్‌ని అతడు అంతగా అభిమానించడానికి మరో ముఖ్య కారణం వుంది. అది– పింగ్‌పాంగ్ ఒక నగ్న చిత్రాన్ని గీసినా, చూసినా దానిగురించి వివరించినా ఎక్కడా అసభ్యత, అశ్లీలత అనే భావం స్ఫురించదు. కళను కళాత్మకంగానే విశ్లేషిస్తారు. ఆయన ఈజిల్‌ముందు నిలబడితే ఆపరేషను టేబుల్ దగ్గర ఏప్రాన్ వేసుకున్న డాక్టరే! అందుకే పింగ్‌పాంగ్ అంజలి నగ్న చిత్రం గీయడానికి తన సంసిద్ధతని వ్యక్తం చేసినపుడు కాదనలేదు. కానీ ఒక చిత్రకారుడుగా కాక ఒక మగవాడిగా అంజలిని చూస్తాడని ఊహించలేదు. అంజలి కూడా ఒక సాధారణ స్త్రీవలె లొంగిపోతుందనుకోలేదు.

ఎక్కడో పొరపాటు జరిగింది. ఎక్కడ?


తాను అంజలిని అర్థం చేసుకోవడంలో పొరబడ్డాడా?

** ** **


బాబు పుట్టిన మూడోనాడుగాని భార్యాభర్తలు ఇద్దరూ ఒకర్నొకరు చూసుకోలేదు. దాదాపుగా రెండు గంటలు కూర్చున్నా ఒకరితో మరొకరు మాట్లాడుకోలేదు. ఇలా ఎందుకు జరిగింది? అని అడిగితే సమాధానం చెప్పాలని ఆమె ఉద్దేశం. కానీ అతడు ఆ ప్రసక్తే తీసుకురాలేదు. చివరకు ఆమే నిశ్శబ్దాన్ని భగ్నం చేసింది.

"ఇలా ఎలా జరిగిందో నాకు తెలియదు. ఒకటి మాత్రం నిజం – ఇది నా అంగీకారంతో జరగలేదు. నేను స్పృహలో లేనప్పుడు జరిగివుండాలి. అతడింత మోసగాడని నేను అనుకోలేదు. హాస్పిటల్ స్టాఫ్ అంతా బేబీని వింతగా చూస్తున్నారు. నేను భరించలేకపోతున్నాను. తొందరగా ఇంటికెళ్ళిపోదాం"

"అంజలీ – ఈ రోజున హాస్పిటల్ స్టాఫ్ చూశారు; రేపు ఇంతకన్నా విశాలమయిన ప్రపంచం చూస్తుంది. ఎవరో ఏదో అనుకుంటారని మనం ఆలోచించడమేమిటి? లోకం కోసం మనం బ్రతకడం లేదు! మనకోసం




5వ తరగతి చదువుతున్న పదేళ్ళ బుల్లి కార్టూనిస్టు వేసిన కార్టూన్




21-7-95 ఆంధ్రజ్యోతి వారపత్రిక

మనం బ్రతుకుతున్నాం.

**FOR ANY CHILD MOTHER IS THE REALITY.**
**FATHER IS THE CONFIDENCE.**

'పాపా...ఈయనే నీ తండ్రి' అని ఎవర్ని చూపితే వారినే తండ్రిగా నమ్ముతుంది బిడ్డ. అలాగే భర్త కూడా! ఈ బిడ్డకు తండ్రి ఎవరని నేను అడగడం లేదు. నేను నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయానా? అని గుంజాటన పడుతున్నాను. అంతే..!!!'

"మీ ఉద్దేశం నాకు అర్థమయింది. నాకు ఇరవైనాలుగు గంటల టైమివ్వండి - చాలు. దయచేసి నన్ను ఒంటరిగా వుండనివ్వండి"

మారు మాటాడకుండా బయటకు నడిచాడతడు.

సరిగ్గా ఇరవై నాలుగు గంటల తర్వాత హాస్పిటల్‌కు తిరిగివచ్చిన అతడికి ఆమె రాసిన లేఖ సమాధానమయింది.

డియర్ చందూ!

ఏ బిడ్డకయినా తల్లి నిజం; తండ్రి నమ్మకం.

నీ నమ్మకం వమ్మయింది. నిజమయిన కారణం నాకూ తెలియదు. ఇది మాత్రం నిజం.

శెలవ్ - శాశ్వతంగా!

—అంజలి

—అని ఉత్తరం రాసిపెట్టి సుదూర ప్రాంతాలకు వెళ్ళిపోవడానికి రైలుస్టేషనుకి వెళ్ళిన ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు; ఇంటికి తీసుకొచ్చాడు.

పై సంఘటన జరిగిన మూడు రోజులకి గాని అమరావతి మ్యూజియం స్టడీ చేయడానికి, వెళ్ళిన పింగ్‌పాంగ్ తిరిగి రాలేదు. విషయం వింటూనే నిర్ఘాంతపోయిన పింగ్‌పాంగ్, చందూ దంపతుల్ని వెంటబెట్టుకుని చందూ ఫ్యామ్లీ డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. ఆ డాక్టరు నిర్ధారణ ఆ దంపతుల్ని నిర్ఘాంతపరిచింది!

పింగ్‌పాంగ్ వైవాహిక జీవితానికి అనర్హుడు!

అతడి వలన ఓ స్త్రీ తల్లి కావడం అసంభవం.

మరి ఆ బిడ్డ?

"నాకు తెలియదు. నేనొక దేశ దిమ్మరిని. నన్ను ఈ బంధాలతో బంధించకండి" అంటూ అక్కడ్నుంచి నిష్క్రమించాడు.

పుట్టిన బిడ్డకు నేపాలీ లక్షణాలు!

ఇంట్లో వున్న నేపాలీ నపుంసకుడు!!

మరి ఆ బిడ్డ?

—దిక్కు తోచక భార్యాభర్తలు ఇద్దరూ కూలబడివున్నస్థితిలో వచ్చింది బామ్మ! బొమ్మలా వున్న ఆ పసిపిల్లను చూస్తూనే "ఓయమ్మో, మా అవ్వ ఎన్ని తరాలకు మళ్ళీ మా ఇంట్లో పుట్టింది!" అంటూ నోరు నొక్కుకుంది.

భార్యాభర్తలు ఇద్దరూ బామ్మ మాటలు అర్థంకాక చూస్తుండిపోయారు. వారి భావాల్ని అర్థం చేసుకున్న బామ్మ అటకమీదున్న ఫోటోలు తీయించింది.

ఓ ఫోటోలో మిలటరీ యూనిఫారంలో వున్న వ్యక్తి సరసన నేపాలీ యువతి!

—అయిదు తరాల క్రితం జరిగిందది: చందూ తాతల తాత మిలటరీలో పనిచేస్తుండగా ఓ నేపాలీ యువతిని పెళ్ళాడాడు. అయితే వారికి కలిగిన సంతానం లక్షణాలన్నీ మన లక్షణాలే!

అయిదు తరాల తర్వాత- ఆ కుటుంబంలో నేపాలీ లక్షణాలు!!

అయిదేమిటి ఏడు తరాల వరకు ఇది సంభవమే. అందుకే అంటారు పెళ్ళి సంబంధాలు చూసేటప్పుడు అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడమని!


సుఖమయ దాంపత్య జీవితం కొరకేనా మీ చింత?

పరువాలను పరుగెత్తించే ప్రక్రియలో

No-1

ఫిజికెమ్స్

ఒజోమెన్

క్యాప్సూల్స్



ఉన్నవి మీ చెంత.

● పుష్టికర యవ్వనశక్తి ● నూతన ఉత్సాహామునకు ● ప్రతిరోజు 2 క్యాప్సుల్స్ పాలతో సేవించండి ● అన్ని మందుల షాపులలో లభిస్తాయి

సంసారం సజావుగా, సంతోషంగా సాగేందుకు సరైన ఎంపిక